# యేసు - "క్షమించబడని పాపము" (మత్తయి 12:22-35)

ఈ పాఠాన్ని ఒక ప్రయోగంతో ప్రారంభించాలను కొంటున్నాను. గడచిన నెలలో ఏనుగులను గూర్చి ఆలోచన చేయని వారిని, దయ చేసి తల ఆడించమంటున్నాను. మీరు మీ తలను ఆడించి యుండవచ్చు. ఈ ప్రయోగంలో రెండవ భాగం కొరకు: యిప్పటినుండి పదిహేను సెకండ్ల వరకు, ఏనుగులను గూర్చి ఆలోచింపకండి.

మీరు ఏనుగులను గూర్చి ఆలోచన చేసైనా ఉంటారు. లేదా వాటిని గూర్చి ఆలోచన చేయకుండడానికి ప్రయాసపడయినా ఉంటారు కదా? నెలల తరబడి ఏనుగులను గూర్చి ఆలోచన చేయకుండానే ఉండవచ్చు. కాని, ''ఏనుగులను గూర్చి ఆలోచింప వద్దని'' నేననగానే, ఆలోచింపకుండ ఉండడానికి ప్రయాసపడవలసి వచ్చింది.

నేను బాలుడుగా ఉన్న దినాల్లో బైబిల్లోని ఈ క్రింది వచనాల దగ్గరకు వచ్చినప్పుడు (నా పరిస్థితి) యిలాగే ఉంది:

> కాబట్టి నేను మీతో చెప్పునదేమనగా - మనుష్యులు చేయు ప్రతి పాపమును దూషణయు వారికి క్షమింపబడును గాని ఆత్మ విషయమైన దూషణకు పాప క్షమాపణలేదు. మనుష్య కుమారునికి విరోధముగా మాటలాడు వానికి పాప క్షమాపణ కలదుగాని పరిశుద్ధాత్మకు విరోధముగా మాటలాడు వానికి ఈ యుగమందైనను రాబోవు యుగమందైనను పాప క్షమాపణ లేదు (మత్తయి 12:31-32).

పరిశుద్ధాత్మకు విరోధంగా ఒక చెడ్డ తలంపు తలంచలేదు, లేక ఆయనకు వ్యతిరేకంగా నా జీవితంలో ఒక మాటైనా పలుకలేదు. అయినా, దీన్ని నేను చదివినతోడనే ''పరిశుద్ధాత్మకు విరోధంగా ఏ చెడ్డ తలంపూ నేను కలిగియుండ కూడదు'' అని ఆలోచించి, దానితో నేను సతమతమయ్యాను. నీకు చెడ్డతలంపు రాబోతు ందంటే, నీవు మరొక దాన్ని గూర్చి ఆలోచనచేయాలని నేను దాన్ని చదివాను. మత్తయి 12:31, 32ను చదివిన తరువాత, పరిశుద్ధాత్మను గూర్చి తలంపు కలుగకుండ ఉండాలని ''నక్షత్రంతో అలంకరింపబడిన ధ్వజము'' అనే పాటను నెమ్మదిగా పాడుకొనడంలో చాలసేపు గడిపాను.

అది నా మూర్ఖ సాహసమే కావచ్చు, కాని పరిశుద్ధాత్మకు విరోధంగా పాపం,

క్షమింపబడని పాపం అనే (అంశాన్ని) మనం చదవాలని కోరుతున్నా, దీనికి భిన్న మార్గంలో మనం చదవాలని కోరుతున్నా. సందర్భంలో ఈ అంశాన్ని చూడాలని కోరుతున్నా. ఈ పాఠాన్ని వివరంగా ఎక్కడా చదవనూ లేదు; విననూ లేదు. అయితే ఆ విధంగా ఈ పాఠాన్ని మనం సమీపించుదాం.

కీర్తిశేషులు జి.సి. బ్రీవెర్ గార్ని అనేకమంది పరిశుద్ధాత్మకు విరోధమైన పాపాన్ని గూర్చి ఆయన్ను అడిగినట్టు చెప్పారు. అలా అడిగిన వారు నాలుగు రకాలుగా ఉన్నారట: (1) అదేమో తెలిసికోవాలని కొందరు యథార్థంగా అడిగినవారు, (2) కొందరు సరదాగా, (3) కొందరు తమకు ప్రియమైన సిద్ధాంతాన్ని బలపరచుకొనడానికి, (4) ఒకవేళ దాన్ని జరిగించామేమో అని భయపడి అడిగారట. నాల్గో రకంలో, చాల యథార్థవంతులు, నమ్మకస్థులైన దేవుని పిల్లలే క్షమింపబడని పాపం చేసినట్టు సంవత్సరాల తరబడి భయంతో గడిపినట్టు నేను కనుగొన్నాను. మూడేండ్లుగా దీనితో సతమతమౌతున్న నా స్నేహితుడొకడున్నాడు. అప్పుడప్పుడు నన్ను పిలుస్తూ వుంటాడు - కొన్ని సమయాల్లో వారానికి రెండు మూడు సార్లు - తాను ఈ పాపం చేయలేదనే అభయం కొరకే. ఈ లేఖన భాగాన్ని గూర్చి గాని, ఈ పాపాన్ని గూర్చి గాని తెలియవలసినదంతా నాకు తెలియదు. అయితే, ఈ సంవత్సరాలన్నిటిలో దీన్ని గూర్చి కొన్ని సంగతులు నేర్చుకున్నాను. (1) బుద్ధిహీనంగా పరిశుద్ధాత్మను గూర్చి ఏదో ఆలోచించడంలోనో, అనడంలోనో ఈ పాపాన్ని నీవు చేయవు. ఒకసారి కేవలం నీవేదో చెప్పినంత మాత్రాన ఈ పాపం నీవు చేయవు. (2) నీవు ఈ పాపం చేశావో లేదో అని నీవు బాధ పడుతూ వుంటే, నీవు (దాన్ని) చేయలేదు. (మనం ముందుకు సాగేకొలది ఈ మాట యొక్క భావం తేడపడుతుంది.

మత్తయి 12కు తిరుగుదాం. మరు రిఫరెన్సు కావాలనుకుంటే మార్కు 3కు తిప్పి, దాన్ని పట్టుకొనియుండు, ఆ అధ్యాయంలో (కూడా) కొన్ని పాయింట్లను మనం గుర్తించబోతాం).

గొప్ప గలిలయ పరిచర్యలో యేసు విరామం లేకుండా ఉన్నారు. ఆయన కపెర్నహోముకు తిరిగి వచ్చియుండవచ్చు. ''అప్పుడు దయ్యము పట్టిన గ్రుడ్డివాడును మూగవాడునైన యొకడు ఆయన యొద్దకు తేబడెను. ఆయన వానిని స్వస్థపరచినందున ఆ మూగవాడు మాటలాడు శక్తియు చూపును గలవాడాయెను'' (22వ.). ఇక్కడ మూడంతలైన అద్భుతం జరిగింది. యేసు గ్రుడ్డివానిని చూచేలా చేశారు. మూగగా ఉన్నవానిని మాట్లాడేలా చేశారు, వానిలోనుండి దయ్యాన్ని వెళ్ల గొట్టారు.

''అందుకు ప్రజలందరు విస్మయమొంది - ఈయన దావీదు కుమారుడు కాడా? అని చెప్పుకొనుచుండిరి'' (23వ.). ''ఈ మనుష్యుడు దావీదు కుమారుడు కాడు. అతడే అయియుంటాడా?'' మరొక దానిలో వుంది. ''దావీదు కుమారుడు'' అనే పదకూర్పు మెస్సీయాను సూచిస్తుంది. ''యేసు మెస్సీయా క్రియలను జరిగిస్తున్నాడు

కాని, మెస్సీయా ఉంటాడని మనం తలంచినట్టు ఈయన రాజ వస్త్రాలతో లేడని'' జనులు అంటున్నారు. ఆయన సంబరముతోను ఆడంబరంతోను రాలేదు. వారి మనస్సులో ప్రశ్న ఉండిపోయింది. యేసును వారు మెస్సీయా అని అనుకుంటున్నారు. అయితే వారికి నిశ్చయతలేదు.

## అవమానకరమైన ప్రస్తావన (మత్తయి 12:24-30)

మన పాఠ్యభాగం దగ్గరకు వచ్చాం. దాన్ని నేను - ''అవమానకరమైన ప్రస్తావన'' అని నేనంటున్నా. ''పరిసయ్యులు ఆ మాట విని'' - అనేక మాటలతో 24 వ వచనం ప్రారంభ మౌతుంది, ''క్షమింపబడని పాపము'' అని యేసు పిలిచిన దానిని చేసిన వారు పరిసయ్యులు, గనుక వారిని గూర్చి మనం తెలిసికోవాలి. ప్రతి దానిని దాని సందర్భంలో పెట్టిచూద్దాం. మత్తయి 11కు వెళ్లి, ప్రభువు వెళ్లిన చోట్ల కెల్ల పరిసయ్యులు ఆయన్ను వెంటాడినట్టు చూడు. వారు యేసును విమర్శించారు; ఆయన్ను చిక్కించుకో ప్రయత్నించారు. ఆయన్ను చిన్న బుచ్చడానికి ఏమేమి అనాలో వాటన్నిటిని వారన్నారు. మత్తయి 11:19 లో - ''ఇదిగో వీడు తిండిబోతును మద్యపానియు సుంకరులకును పాపులకును స్నేహితుడునని'' వారన్నారు! మత్తయి 12, మొదటి భాగంలో, సబ్బాతును ఆయన మీరినట్టు రెండు మార్లు వారు ఆయనతో సంఘర్షణ పడ్డారు. ఇది మనలను కీలక వచనానికి నడిపిస్తుంది. ''అంతట పరిసయ్యులు వెలుపలికి పోయి, ఆయనను ఏలాగు సంహరింతుమా అని ఆయనకు విరోధముగా ఆలోచన చేసిరి'' (మత్తయి 12:14).

''క్షమింపబడని పాపమని'' యేసు చేసిన ప్రతిపాదనను మనం సమీపించే టప్పుడు, ఎప్పుడో ఒకసారి సరియైన గ్రహింపులేక మౌఢ్యంగా ప్రభువైన యేసు యొక్క పరిచర్యను గూర్చి మాట్లాడిన దేవుని పిల్లలకు యిది సంబంధించింది కాదని గుర్తుంచుకోవాలి. ఈ మార్గంలో చాలకాలంగా ఉన్న జనులను గూర్చి మనం మాట్లాడుతున్నాం. మత్తయి 12:24 లోనిది వారు తీసికొన్న మార్గానికి పరిణామం మాత్రమే.

ఇప్పుడు 24 వ వచనాన్ని ముగించుదాం: ''పరిసయ్యులు ఆ మాట విని - వీడు దయ్యములకు అధిపతియైన బయెల్జెబూలువలననే దయ్యములను వెళ్లగొట్టుచున్నాడు గాని మరియొకనివలన కాదనిరి''.

యేసు చేసిన మహత్కార్యాలకు మూడు గుణలక్షణాలున్నాయి: (1) ఆలస్యం లేనిది, (2) పూర్ణమైనవి, (3) ఒప్పుకొన జేసేవి. యేసు చేసిన మహత్కార్యాన్ని ఎవడు కాదనలేడు. తన శత్రువులు ఆయన మహత్కార్యం చేయలేదని చెప్పలేరు. ఆయన చేశాడు, కాని గారడి విద్యవలన చేశాడు. ఈ సందర్భంలో ''బయెల్జెబూలు'' అనేది ''సాతాను''కు ప్రతిగా వాడబడింది (26 వ.). ''యేసుకు సాతానుతో స్నేహ

సక్యముంది. దానివలన ఆయన దయ్యాలను వెళ్లగొట్టగలుగుతున్నాడ'' ని పరిసయ్యు లంటున్నారు.

దేవదూషణకరమైన ఈ అసత్యం యేసు మరణంతో అంతరించలేదు. ఆ తరువాత కాలంలో యూదా మతపక్షంగా పోరాడినవారు, యేసు గారడీని, మంత్ర శక్తులను ఉపయోగించినట్టు వాదించినట్టు సంఘ చరిత్ర చెప్తుతుంది. ఆయన మహత్కార్యాలను వారు కాదనలేకపోయారు గాని, అపవిత్రమైన శక్తితో ఆయన వాటిని చేసినట్టు వారన్నారు.

25వ వచనం ప్రకారం, యేసు పరిసయ్యుల తలంపుల నెరుగును. ఆయన వినికిడిలో వారు ఆ దేవదూషణకరమైన ప్రతిపాదన చేయలేదు. యేసును హీనపరచడానికి వారు దీన్ని వేరే స్థలంలో చేశారు. అయినా, వారేమనుకొంటున్నారో ఆయనకు తెలుసు. దయచేసి గమనించు. చెప్పబడిన కొన్ని మాటలకు ప్రతిగా యేసు యిలా అనలేదు. వారి మనస్సులోనికి, హృదయాల్లోనికి యేసు చూచారు. ఇలాటి దానికి ఆయన అలా అన్నారు.

''ఆయన వారి తలంపుల నెరిగి వారితో యిలా అన్నారు'' వారు చెప్పేది ఎందుకు అర్థరహితమయ్యిందో కనుపరచడానికి ఆయన మూడు వివాదాలను సూచించారు. ఆయన మొదటి వివాదమేమంటే -

> ''తనకు తానే విరోధముగా వేరుపడిన ప్రతి రాజ్యము పాడైపోవును తనకు తానే విరోధముగా వేరుపడిన యే పట్టణమైనను ఏ యిల్లయినను నిలువదు. సాతాను సాతానును వెళ్లగొట్టిన యెడల తనకు తానే విరోధముగానే వేరు పడును; అట్లయితే వాని రాజ్యమేలాగు నిలుచును?'' (25b-26 వచ.).

వారు చెప్పేది సత్యమైయుంటే, సాతాను అంతర్గత యుద్ధంలో చిక్కుబడి యుందన్నమాట. గనుక తన్ను తానే నాశనం చేసికొనే కథనంలో ఉంది. సాతాను మూగవాడయ్యాడని అన్నట్టే. సాతానును గూర్చి నీవు ఎంత హీనంగా మాట్లాడినా సరే, - వాడు చెడుగు యొక్క ప్రతి రూపమేగాని; వాడు మూగవాడు మాత్రం కాడు. గనుక యేసు ఏమంటున్నారంటే - ''మీరు చెప్పేది తార్కిక విరుద్ధం!''.

రెండు, వారు చెప్పేది ఒక దానితోనొకటి ''పొసగనిది'' అని యేసు అంటు న్నారు. ''నేను బయెల్జెబూలువలన దయ్యములను వెళ్లగొట్టుచున్నయెడల మీ కుమారులు ఎవరివలన వాటిని వెళ్లగొట్టుచున్నారు? కాబట్టి వారే మీకు తీర్పరులై యున్నారు'' (27వ.). దయ్యాలను వెళ్లగొట్టడమనేది ఆ దినాల్లో యూదుల మధ్య సాధారణమైన వాడుకగా ఉండేది. అపొస్తలుల కార్యాల్లో దీనికి ఉదాహరణలు కన్పిస్తాయి. అయినా యూదులు జరిగించినవి, యేసును ఆయన అపొస్తలులును జరిగించినట్టివి కావని ప్రపంచ సంబంధమైన చరిత్ర చెప్తుతుంది. యూదులు దయ్యాలను వెళ్లగొట్టడమనేది సోదెలాంటిది. బహు దీర్ఘంగా మంత్ర ఉచ్చరణ చేస్తూ,

బూటకమైన వస్తువులను ప్రయోగిస్తుంటారు. ''వదలిపో'' అని యేసు ఆజ్ఞాపించిన విధానానికిని, వారు చేసే దానికిని బహు వ్యత్యాసముంది. అయినా, వారి శిష్యులు దయ్యాలను వెళ్ల గొట్టుతున్నట్టు వారు చెప్పుకుంటారు. వారు దాన్ని చేస్తున్నట్టు నమ్ముతారు. గనుక యేసు వారి వాదాన్ని తీసి, వారికే వ్యతిరేకంగా దాన్ని వర్తింపజేసి, తార్కిక ముగింపుకు తెచ్చి, కారణానికి నిలువని వారి స్థితిని చూపించారు. ''నేను సాతాను శక్తితో దయ్యాలను వెళ్లగొట్టినట్లయితే, మీ శిష్యులు కూడా అదే సాధన వలన చేస్తున్నారు, కదా''? అని యేసు అంటున్నారు. అయితే, పరిసయ్యులు దాన్ని అంగీకరించడానికి సిద్ధపడలేదే! అందువలన యేసు వారితో ఏమని వాదిస్తున్నారంటే - ''మీది పొసగని స్థితి''.

యేసు యిలా కొనసాగించారు : ''దేవుని ఆత్మవలన నేను దయ్యములను వెళ్ల గొట్టుచున్న యెడల నిశ్చయముగా దేవునిరాజ్యము మీ యొద్దకు వచ్చియున్నది'' (28 వ.). దేవుని రాజ్యం అప్పటికే స్థాపింపబడిందని యేసు చెప్పలేదు. అపొ. 2 వరకు అది జరుగలేదు. అయితే ప్రజలకున్న తాత్కాలిక తీర్మానం సరియైనదని యేసు గుర్తించారు: మెస్సీయా వచ్చాడు. కీర్తన 2, తక్కిన లేఖన భాగాలు - మెస్సీయా రాజులా రావాలని వక్కాణించాయి. రాజు వచ్చాడంటే - ఆ మేరకు రాజ్యం వచ్చింది. బెయెల్జెబూలు వలన దయ్యాలు వెళ్ల గొట్టబడే దానికి బదులు, రాజుగా వచ్చినవాని వలన అవి వెళ్లగొట్ట బడుతున్నాయి. వారు కనిపెట్టుతూ ఉండిన రాజు వచ్చాడు. వారి కన్నులు, హృదయాలు తెరిచినట్లయితే ఈ సత్యాన్ని వారు చూడ గలిగియుండే వారే!

28 వ వచనంలో ''దేవుని ఆత్మవలన'' అనే మాటలను గుర్తించు. నేను దీనిని బెయెల్జెబూలు ఆత్మవలన కాదుగాని, దేవుని ఆత్మవలననే చేస్తున్నానని యేసు వక్కాణించారు.

యేసు యొక్క మూడవ వాదమేమంటే - ''మీరు చెప్పేది అసాధ్యమయ్యింది''. ''ఒకడు మొదట బలవంతుని బంధింపని యెడల యేలాగు ఆ బలవంతుని యింటిలో చొచ్చి అతని సామాగ్రి దోచుకొనగలడు? అట్లు బంధించిన యెడల వాని యిల్లు దోచుకొనును'' (29 వ.). (మార్కు 3లో యిది పిలువబడినట్టు) ఆ చిన్న ఉపమానంలో బలవంతుడు - అపవాది. నీ విరోధిని తేలిగ్గా అంచనా వేయవద్దు. అపవాది బలవంతుడైన విరోధి. ప్రభువు యొక్క ఉదాహరణలో - వానికంటే బలవంతుడు వచ్చి, వానిని బంధించాడు. ఆ మీదట అతని యిల్లును దోచుకున్నాడు. ఆయన దయ్యములను వెళ్లగొట్టినప్పుడు యేసు జరిగించిన పని యిదే!

సాతానుని బంధించడం అనే అంశం - వ్యామోహాన్ని కలిగిస్తుంది. ''బంధించడం'' అనేది - నరుల మీద వాని శక్తిని, ప్రభావాన్ని పరిమితి చేయడానికి సంబంధించింది. క్రీస్తు సిలువలో మరణించినప్పుడు సాతాను బంధింపబడ్డాడు.

మానవాళిపై అపవాదికుండిన కట్టకడపటి శక్తిని యేసు మరణం విరుగ గొట్టింది. ఒక విధంగా చెప్పాలంటే - అరణ్యంలో యేసు అపవాది యొక్క శోధనలను జయించి నప్పుడే వానిని బంధించడం ఆరంభమయ్యింది. అది ప్రభువు యొక్క పరిచర్యగుండా కొనసాగింది. ఆయన సిలువ మరణంలో అది ముడివేయబడే వరకు, సాతానుచుట్టు త్రాళ్లుగట్టి గట్టిగా బిగించబడుతునే ఉన్నాయి. అపవాది మీద తన శక్తిని ప్రదర్శింపకుండ దీన్ని జరిగించే మార్గం లేదని, యేసు వక్కాణించారు. సాతాను శక్తివలన ఆయన తన కార్యాలను జరిగించలేదు. సాతానుపై తన అధికారాన్నే ఆయన ప్రదర్శించారు.

ఇంతకూ ఆయన చెప్పేదేమంటే - తనకు అపవాదికి మధ్య గొప్ప పోరు (యుద్ధం) జరుగుతుందని! ఆత్మ సంబంధమైన ఈ యుద్ధంలో, ప్రతి ఒక్కరూ ఏదో ఒక పక్షాన నిలిచియుండాలని తరువాత వచనంలో ఆయన చెప్పారు!. ''నా పక్షమున నుండని వాడు నాకు విరోధి; నాతో కలిసి సమకూర్చనివాడు చెదర గొట్టువాడు'' (30వ). తన రాజ్య స్థాపనకు వారిని సిద్ధపరచడానికిగాను, యేసు తనకు శిష్యులను కూర్చుకొంటున్నారు. మరో పక్షంగా జనులు యేసును వెంబడింపకుండేలా పరిసయ్యులు అడ్డు తగులుతూ, ఆయన్ను అపకీర్తిపాలు చేసి - శిష్యులను చెదరగొట్టజూస్తున్నారు. యేసు చెప్పింది - పరిసయ్యులకు మాత్రమేకాదు. (అక్కడ వింటున్న వారికందరికి, నేడు మనకు కూడా); ''నీవు ఏ పక్షంగా ఉంటావో నీవే నిర్ణయించుకోవాలి'' యేసు క్రీస్తు విషయంలో ''తటస్థమైన'' ఏ స్థితీలేదు.

## ఉలికి పడేలా చేసిన ప్రకటన (మత్తయి 12:31-32)

31-32 వచనాల్లో ''ఉలికి పడేలా చేసిన ప్రకటన''కు మనం సిద్ధంగా ఉన్నాం.

31వ వచనం ప్రారంభమౌతుంది; ''కాబట్టి (ఇప్పుడు జరిగిన దాన్నిబట్టి, అంటే - ఈ సందర్భంలో వారేమన్నారో నేనేమి చెప్పానో దాన్నిబట్టి) నేను మీతో చెప్పేదేమంటే, ఏ పాపమైనా దూషణయైన మనుష్యులకు క్షమింపబడుతుంది. యేసు చెప్పినదేమనగా, '' నేను చెప్పబోయేది కాకుండ మరే పాపమైనా, నేను చూచింప బోయేది కాకుండ మరే దూషణయైనా క్షమింపబడుతుంది''.

యేసు మాట్లాడిన ''దేవదూషణ'' ఏమి? ''వ్యతిరేకముగా మాట్లాడుట'' అనే మూలంనుండి ''దూషణ'' అనే పదం వచ్చింది. ఈ దూషణ అనేది ముఖ్యంగా దేవునికి విరోధంగా మాట్లాడటం; పరిశుద్ధమైన వస్తువులను గౌరవం లేకుండా చూడడం - అనే వాటికి వర్తిస్తుంది. పాత నిబంధనలో దేవదూషణ మరణశిక్ష విధింపదగిన పాపాలలో ఒకటి. దానికి ప్రతిగా, ''ప్రతిపాపమును దూషణయు క్షమింపబడునని యేసు అన్నారు. పౌలు ''దూషణ'' అనే దోషం చేశాడు, అయినా క్షమింపబడ్డాడు (1 తిమోతి 1:13, 15).

అప్పుడు, ప్రతివిధమైన దూషణ క్షమింపబడును గాని అని అన్న తరువాత, ఆత్మకు విరోధమైన దూషణ క్షమింపబడదని యేసు తెలిపారు. అది భయానకంగా ఉంది, కదూ?

తరువాత వచనంలో, పరిశుద్ధాత్మకు వ్యతిరేకమైన దూషణను గూర్చి ఎక్కువగా తెలిసికొంటాం: ''మనుష్య కుమారునికి విరోధముగా మాటలాడువానికి పాప క్షమాపణ కలదుగాని పరిశుద్ధాత్మకు విరోధముగా మాటలాడువానికి ఈ యుగమందైనను రాబోవు యుగమందైనను పాపక్షమాపణ లేదు'' (32వ.).

సంవత్సరాలు జరుగుతున్న కొద్దీ, క్షమింపబడని పాపాన్ని గూర్చి వివిధాలైన సిద్ధాంతాలు రూపించబడ్డాయి. కొందరు దాన్ని వ్యభిచారమన్నారు. మరికొందరు దాన్ని నరహత్య అన్నారు. ఒకడు తన్నుతాను చంపుకొన్నట్టయితే, అతనికి మారుమనస్సు పొందే అవకాశముండదు గనుక ఆత్మహత్యను సాధారణంగా క్షమింపబడని పాపం క్రింద జమకట్టారు. ఏది యెలాగున్నా, అది క్షమాపణ పొందని పాపమే గాని, క్షమింపబడని పాపం కాదనుకో! ఒక పాపం జరిగింది, దాని తరువాత పాపి ఎంత కాలం జీవించినా, అది క్షమించబడదు - అనే దాన్ని గూర్చి యేసు మాట్లాడుతున్నారు.

ఆ పాపము ఏదో మనం ఊహించుకోనవసరంలేదు. అదేదో యేసు మనకు తెలియజేశారు. అది, ''పరిశుద్ధాత్మకు విరోధంగా మాట్లాడటం''. 28వ వచనంలో ''దేవుని ఆత్మతో'' ఆయన దయ్యాలను వెళ్లగొట్టుతున్నానన్నారు. అయితే పరిసయ్యులు - బెయెల్జెబూలు శక్తివలన ఆయన దయ్యాలు వెళ్లగొట్టుతున్నట్టన్నారు. దాని భావమేమంటే - పరిసయ్యులు దేవుని ఆత్మ అంటే బెయెల్జెబూలనే.

''యేసు మాట్లాడుతుంది అదేనని నిశ్చయమేనా''? అని ఎవరైనా అడుగవచ్చు. మార్కు 3లో ఉన్న మరు రిఫరెన్సును క్లుప్తంగా చూడు. క్షమింపబడని పాపాన్ని గూర్చి మార్కు అదే ప్రాథమిక ప్రతిపాదన చేసిన తరువాత (28-29 వచనాల్లో). 30వ వచనంలో వివరణ యిలా ఇస్తున్నాడు: ''ఎందుకనగా ఆయన అపవిత్రాత్మ పట్టిన వాడని వారు చెప్పిరి''. మరో విధంగా చెప్పాలంటే - దేవుని ఆత్మ కాకుండ, యేసు అపవిత్రమైన ఆత్మగలవాడని పరిసయ్యులు అంటున్నారు గనుక వారు క్షమింపబడని పాపం చేశారు.

మత్తయి 12:32కు తిరిగి వస్తే - ''ఈ యుగమందైనను రాబోవు యుగమందైనను (అది) క్షమింపబడదు'' అని యేసు అన్నారు. అంటే, కొన్ని పాపాలు రాబోవు యుగంలో క్షమింపబడతాయని దాని భావమా? కాదు. అది ఎన్నటికి, ఎన్నటెన్నటికి క్షమింపబడదని వక్కాణించడానికి యేసు అలా చెప్పారు!

పరిసయ్యులు నిజంగా క్షమింపబడని పాపం చేయలేదు. యేసు కేవలం వారిని హెచ్చరించుతున్నారని కొందరు అనుకొంటున్నారు. ''భూమి మీద ఉన్నప్పుడు మీరు

న్ను నిరాకరింపవచ్చు. పరిశుద్ధాత్మ వచ్చి క్రొత్త నిబంధనను బయలు పరిచినప్పుడు, ఆ ప్రత్యక్షతను మీరు నిరాకరించినట్లయితే, అప్పుడు మీరు క్షమించబడరని'' యేసు అన్నట్టు వారాలోచిస్తున్నారు. యేసు చెప్పింది ఒకవేళ అదేనేమో. అయినా ఆ వాఖ్యానంతో నేను సౌకర్యంగా లేను. ఎందుకంటే, పరిసయ్యులు క్షమింపబడని పాపం చేయలేదని అది అంటుంది. లేఖనాన్ని సహజంగా చదివితే, అది వారు చేశారంటుంది. యేసు మాటలు కేవలం హెచ్చరికలా వినిపించడం లేదు. మత్తయి 23 లో పరిసయ్యులకు యేసు కట్టిన విలువెంతో చూడు, వారు తుచ్ఛమైన స్వభావులు.

అలాటప్పుడు ''మనుష్యకుమారునికి విరోధముగా మాటలాడువానికి పాప క్షమాపణ కలదుగాని పరిశుద్ధాత్మకు విరోధముగా మాటలాడువానికి ... పాప క్షమాపణ లేదు'' అన్నప్పుడు యేసు భావమేమి?

మత్తయి 11 కు తిరిగిరా: అక్కడ వారు యేసును తిండిబోతు, త్రాగుబోతు అని అన్నారు. 12 వ అధ్యాయంలో సబ్బాతు విషయంలో ఆయన్ను గూర్చి కఠినమైన మాటలు పలికారు. 12:14 లో ''ఆయనను ఎలాగు నశింపజేతుమా (సంహరింతుమా) అని ఆయనకు విరోధముగా ఆలోచన'' చేశారు. ''వ్యక్తిగా'' ఇవన్నీ ఆయనకు వ్యతిరేకమైనవి. మళ్ళీ, దయ్యపు శక్తివలన ఆయన దయ్యాలను వెళ్ల గొట్టుతున్నాడని అన్నారు (24 వ.). ''మీరు బహుదూరం వెళ్ళారు. వ్యక్తిగా నన్ను మీరు ఎదిరించడం మాత్రమే కాదు. ఇప్పుడు నేను సాతాను వద్దనుండి శక్తి పొందానుగాని దేవుని యొద్దనుండి కాదని మీరంటున్నారు'' అన్నట్టు యేసు చెప్పారు. నేను దీనిని దేవుని ఆత్మవలన చేస్తున్నా, అయితే నేను అపవిత్రాత్మవలన చేస్తున్నానని మీరంటున్నారు. ''పరిశుద్ధాత్మను సాతాను అనడంలో మీరు ఎంతగా కఠిన హృదయులయ్యారంటే - ఆత్మ సంబంధంగా తిరిగి రాలేని పాయింటుకు మీరు చేరుకున్నారు!''

ఆ వ్యక్తులు చేసిన ఆ ప్రత్యేకమైన పాపం ఈ దినాన నీవు చేయలేవు. మహత్కార్యాలు చేసికొంటూ యేసు భూమి మీద సంచరించబోయేది లేదు. ఆయన అప్పుడు వాటిని జరిగించారు. ఆయన బెయెల్జెబూలు వలన మహత్కార్యాలు జరిగిస్తున్నారంటూ ఆయన వైపు చూపలేవు. గనుక ఆ ప్రత్యేకమైన పాపము నీవు చేయలేవు. యేసు మాట్లాడిన ఆ పాపాన్ని నీవు చేసినట్టు అనుకుంటే, అది నిన్ను బాధించుతూవుంటే, దాన్ని గూర్చి (లేక దాని విషయం) మరచిపో. దాన్ని నీవు చేయలేవు.

అయినా, సాధారణంగా అలాటి రకమైన పాపాన్ని, ఆ కోవకు చెందిన పాపాన్ని చేసే అవకాశముంది. మార్కు 3 కి మరలా వెళ్ళుదాం. ఈ సంభవాన్ని గూర్చి మార్కు యిచ్చిన సందేశంలో 29 వ వచనం యిలా అంటుంది: ''పరిశుద్ధాత్మ విషయము దూషణ చేయువాడెవడును క్షమాపణ పొందక నిత్య పాపముచేసినవాడైయుండును ...''

కొన్ని పాపాలు నిత్య పాపాలు. కొన్ని పాపాలను పోగొట్టుకోలేం. కొన్ని పాపాలు ఎన్నటికిని క్షమింపబడవు.

ఆ రకమైన పాపాన్ని గూర్చి యోహాను తన మొదటి పత్రికలో మాట్లాడుతున్నాడు:

> ''తన సహోదరుడు మరణకరము కాని పాపము చేయగా ఎవడైన చూచిన యెడల అతడు వేడుకొనును; అతని బట్టి దేవుడు మరణకరముకాని పాపము చేసినవారికి జీవము దయచేయును. మరణకరమైన పాపము కలదు. అట్టి దానిని గూర్చి వేడుకొనవలెనని నేను చెప్పుటలేదు. సకల దుర్నీతియు పాపము; అయితే మరణకరముకాని పాపము కలదు'' (1యోహాను 5:16-17).

''మరణమునకు నడిపించు పాపము'' అనే పద సముదాయాన్ని గమనించు. నీవు అలాటి పాపం చేస్తే, నీవు యికను ఎదురు చూడవలసింది మరణం మాత్రమే. మత్తయి 12 ఎంత భయానకంగా ఉందో, అదికూడ అంతే భయానకంగా ఉంది; కదూ?

''మరణానికి నడిపించే'' పాపమంటే ఏమిటి? ''నిత్య పాపమం''టే ఏమిటి? పాఠ్య భాగానికి వెళ్ళుదాం.

## మితమైన ప్రతిపాదన (మత్తయి 12:33-35)

మత్తయి 12, తరువాత భాగంలో ''మితమైన ప్రతిపాదన''ను కనుగొంటాం.

యేసు పరిశుద్ధాత్మకు విరోధంగా మాట్లాడడం అనే కథనం వెంట తనకు యిష్టమైన ఉదాహరణలో ఒకటివస్తుంది. ''చెట్టు మంచిదని యెంచి దాని పండును మంచిదే అని యెంచుడి; లేదా, చెట్టు చెడ్డదని యెంచి దాని పండును చెడ్డదే అని యెంచుడి. చెట్టు దాని పండువలన తెలియబడును'' (33 వ.). ''నా శీలాన్ని నా ఫలం వలన, నా జీవితం వలన మీరు తెలిసికొనగలరు'' అని ఆయన చెప్పుతున్నారు. నేను ప్రజలను స్వస్థపరచుతున్నాను, ప్రజలకు సహాయం చేస్తున్నాను, దయ్యాలను వెళ్లగొట్టుతున్నాను. నా మంచి ఫలం వలన నా శీలం మంచిదని మీరు తెలిసికొనగలరు. పరిసయ్యుల సంగతేమి? వారి జీవితపు ఫలం చెడ్డది. కాబట్టి వారు చెడ్డవారై యుండాలి.

బెయెల్జెబూలు శక్తివలన ఆయన దయ్యాలు వెళ్ల గొట్టుతున్నాడని పరిసయ్యులు అన్న ఒక వాంగ్మూలాన్నిబట్టి యేసు మాట్లాడటం లేదని గమనించు. ఇంతకు పరిసయ్యులు ఎలాటివారో, వారి జీవిత విశేషమంతటిని గూర్చి యేసు మాట్లాడు తున్నారు!

34-35 వచనాల్లో యింకను ఆయన యిలా అన్నారు:

> ''సర్ప సంతానమా, మీరు చెడ్డవారైయుండి ఏలాగు మంచి మాటలు పలుకగలరు? హృదయమందు నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడును గదా. సజ్జనుడు తన మంచి ధననిధిలోనుండి సద్విషయములను తెచ్చును; దుర్జనుడు తన చెడ్డ ధననిధిలోనుండి దుర్విషయములను తెచ్చును''.

పరిసయ్యులు దూషణకరంగా మాట్లాడారు. అయితే ఆ దూషణ మాటలు ఎక్కడనుండి పుట్టుకొచ్చాయ్? అవి వారి హృదయాల్లోనుండి పుట్టుకొచ్చాయ్. యేసు వారి హృదయముల నెరుగు అన్న సంగతి జ్ఞాపకముంచుకో (25వ.). కేవలం వారు పలికిన కొన్ని మాటలను గూర్చియే యేసు మాట్లాడలేదు. వారి హృదయ స్థితిని గూర్చి ఆయన మాట్లాడుతున్నారు.

మత్తయి ఆ తరువాత అధ్యాయాన్ని చూడు. 13వ అధ్యాయం విత్తువాని ఉపమానంతో ప్రారంభమౌతుంది. ప్రభువు సూచించిన మొదటి నేల సత్యమనే విత్తనం దూరలేనంత గట్టిగావుంది. (అపవాది) పక్షివచ్చి దాన్ని తీసికొని వెళ్ళేవరకు ఆ విత్తనం బయటే పడియుంది. ఈ సందర్భంలో - పరిసయ్యులకున్న హృదయపు రకం యేసు మనస్సులోవుంది. సువార్త సందేశం దూరలేనంత కఠినమైన హృదయం!

కొంత సేపైన తరువాత, యేసు యిలా అన్నారు:

> ఈ ప్రజలు కన్నులార చూచి, చెవులారా విని, హృదయముతో గ్రహించి మనస్సు త్రిప్పుకొని నావలన స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వినది, వారి చెవులు వినుటకు మందములైనవి, వారు తమ కన్నులు మూసికొని యున్నారు (మత్తయి 13:15). గనుక మీరు వినుట మట్టుకు విందురుగాని గ్రహింపనే గ్రహింపరు, చూచుట మట్టుకు చూతురుగాని యెంతమాత్రమును తెలిసికొనరు.

యేసు పరిసయ్యులను గూర్చి మాట్లాడుతున్నారు. కేవలం వారు పలికిన మాటలను బట్టి కాదు, ఆయన వారి హృదయ స్థితిని బట్టి మాట్లాడారు. కఠిన పరచబడిన వారి మనస్సాక్షికి ఆ మాటలు గుర్తులుగా ఉన్నాయి. వారు ఆయనకు విరోధంగా మరలా మరలా మాట్లాడారు. వింతను గొలిపే మూడంతలైన మహత్కార్యం యేసు చేయగా వారెప్పుడైతే దాన్ని సాతానువలన జరిగింది అని అన్నారో, నిస్సందేహంగా అప్పుడే మారుమనస్సు పొందలేని ఒక స్థితికి వారొచ్చి చేరుకున్నట్టు ఆయన చెప్పారు. ఆ విధంగా వారు క్షమింపబడలేక యున్నారు. నీవు మారుమనస్సు పొందగల ఏ పాపమైనా క్షమింప బడనగును అనే సత్యాన్ని యింతకంటె ఎక్కువగా నొక్కి చెప్పలేను. క్షమించుటకు దేవునికి అసాధ్యమైన పాపాన్ని ఒకడు చేయగలడని అనడం, దేవుని గూర్చి అత్యల్పంగాను, నరుని గూర్చి అత్యధికంగాను చెప్పినట్లౌతుంది. నీవు మారుమనస్సు పొందగల ఏ పాపమైనా దేవుడు క్షమించగలడు.

అయినా, పరిసయ్యుల హృదయాలు ఎలా కఠినపరచబడ్డాయో, నీ హృదయం కూడా అలా కఠినపరచబడనగును అనే వాస్తవం అలాగే మిగిలియుంటుంది. పాపంనుండి మారుమనస్సు పొందలేని ఒక స్థితికి నీవు చేరవచ్చు. జాగ్రత్తగాను, ప్రార్థనా పూర్వకంగాను హెబ్రీ. 6:4-6ను ఆలోచించు:

> ఒకసారి వెలిగింపబడి, పరలోక సంబంధమైన వరమును రుచి చూచి, పరిశుద్ధాత్మలో పాలివారై దేవుని దివ్య వాక్యమును రాబోవు యుగ సంబంధమైన శక్తుల ప్రభావమును అనుభవించిన తరువాత తప్పిపోయినవారు, తమ విషయములో దేవుని కమారుని మరల

సిలువవేయుచు, బాహాటముగా ఆయనను అవమానపరచు చున్నారు, గనుక మారుమనస్సు పొందునట్లు అట్టివారిని నూతన పరచుట అసాధ్యము.

ప్రాముఖ్యమైన మాటలను గుర్తించు: ''వారిని మారుమనస్సు పొందునట్లు నూతన పరచుట అసాధ్యము''. ఆ స్థితికి చేరే అవకాశముంది. నీవు సువార్తను నిరాకరింపవచ్చు. నిన్ను ప్రేమించి నీకు సహాయం చేయాలని మాట్లాడిన వారి ప్రస్తావనలను నీవు తృణీకరింపవచ్చు మరలా, మరలా నీవు నిరాకరింపవచ్చు. నీవు అలా చేసే ప్రతిసారి నీ హృదయం మునుపటికంటె కొంచెం ఎక్కువ కఠినంగా మారుతుంది. (ఎక్కువగా వాతవేయబడుతుంది), నీవు తిరిగిరాలేని ఆత్మసంబంధమైన స్థితి చివరకు ఏర్పడుతుంది.

హెబ్రీ రచయిత హెచ్చరించినట్లు: ''మరియు పరిశుద్ధాత్మ యిట్లు చెప్పుచున్నాడు. - నేడు మీరు ఆయన శబ్దము వినినయెడల ... మీ హృదయములను కఠినపరచుకొనకుడి'' (3:7-8).

## ముగింపు

నేను మళ్ళా చెప్పుతున్నా: ఈ రకమైన పాపం చేశావని నీవు విచారిస్తుంటే, నీవు దాన్ని చేయలేదు. నీ హృదయం యింకా మెత్తనిదిగా వుంది, అందుకే నీవు యింకా విచారిస్తున్నావ్.

అయినా, అలాటిది చేసే అవకాశముంది గనుక జాగ్రత్త. మనం మూర్ఖంగా పాపాన్ని హత్తుకొనియుంటే, ఏ పాపమైనా, ''ఎవడేమనుకున్నా నాకు లెక్కలేదు, నాకు యిది నచ్చింది, దీన్ని మానక చేస్తూనేవుంటా''నని మనమనుకుంటే - మన హృదయాలు కఠినమైపోతూనే ఉంటాయి. ఇలా సంభవించడాన్ని మనం జరుగనిస్తే, నూతన పరచబడలేని ఒక స్థితికి మనం చేరుకోగలం. బైబిలు దీని విషయంలో తేటగా ఉంది. మనం మారుమనస్సు పొందలేకపోతే, మనం క్షమించబడం.

ప్రభువు చూడ గలిగినట్లు నీవు నేను హృదయాలను చూడలేం. ఒకడు ఆ స్థితికి ఎప్పుడు చేరుకున్నాడన్నది మనం నిర్ణయించలేం. అది ఎప్పుడు జరుగుతుందో దేవునికి తెలుసు. అది సంభవించినప్పుడు, దేవుడు వానిని వదలి వేస్తాడు (రోమా 1:24; KJV). అది ఎంతటి అపాయకరమైనది! మెత్తని హృదయాలు ఎల్లవేళలా కలిగియుండేలా దేవుడు మనకు సహాయము చేయును గాక!

## నిత్య పాపము

ఆత్మకు విరోధమైన దూషణకు సంబంధించిన దానికి ''నిత్య పాపము'' అని క్రీస్తు పేరు పెట్టారు; అది క్షమింపబడనిదిగా చేశారు. పరిసయ్యులను నశింప జేయగలిగింది ఆ ఒక్కపాపమేకాదు. అయితే అదొక్కటే వారిని నాశనం చేసింది. క్రీస్తు నీతిమంతుడని వారు ఎరిగియున్నా, ఆయన్ను దూషించడంలో, వారి వింతైన దుష్టత్వం మరింతగా చెడిపోయింది. వారు ఎరిగి యున్నదానికి భిన్నంగా, ఆయన అపవిత్రాత్మ పట్టిన వాడని వారన్నారు. సత్యానికి బదులుగా అసత్యాన్ని, వెలుగునకు చీకటిని, నీతి స్థానంలో చెడుగును ఉంచి, ప్రభువుకు విరోధంగా తమ కండ్లను హృదయాలను మూసికొన్నారు. వారి దూషణ పరలోకపు నిరీక్షణను తుడిచి వేసే లాంటిది. అదే కోవకు చెందియున్న అర్థరహితమైన గ్రుడ్డి వ్యతిరేకతను ప్రభువునకు కనుబరచినట్లయితే, ఖచ్చితంగా అలాటి ఫలితాలే నేడు కూడా వస్తాయనేది నిస్సందేహం.

ఈ క్రింది సూచింపబడిన రిఫరెన్సుల్లో పరిశుద్ధాత్మకు విరోధంగా ఏడు రకాలైన పాపాలను గుర్తింపవచ్చు:

(1) ఆత్మకు విరోధంగా అపేక్షించుట (గలతీ. 5:16).

(2) పరిశుద్ధాత్మను ఎదిరించుట (అపొ. 7:51).

(3) దుఃఖపరచుట (ఎఫెసీ. 4:30).

(4) అబద్ధ మాడుటకు (మోస పుచ్చుటకు) (అపొ. 5:3).

(5) అవమానపరచుట (తిరస్కరించుట) (హెబ్రీ. 10:24).

(6) విరోధమైన దూషణ (మార్కు 3:29);

(7) ఆర్పుట (1 థెస్స. 5:19).

ఏది ఎలాగున్నా, పాపంలో దాగియున్న సహజ స్వభావ మేమంటే - ఏ ఒక్క పాపంలోనైనా నిలిచియుంటే మాత్రం, అది మన ఆత్మలో మండుతున్న పవిత్రమైన అగ్నిని ఆర్పివేయవచ్చు, కడకు నిత్య మరణాన్ని అది మనకు ప్రసాదింపనూ వచ్చు.

**మత్తయిపై వ్యాఖ్యానం**
**బర్టన్ కోఫ్మన్**